ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 233 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- శనివారం 29 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

సరిహద్దు అవతలి కుట్రలు..

పిల్లల ప్రాణాలు తీస్తున్నాయి: జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం

హింసతో దక్కేదేమీ లేదని గుర్తించి.. పాకిస్థాన్ ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని వదులుకోవాలని జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌధరీ హితవు పలికారు.

మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): సరిహద్దు అవతల పన్నుతున్న కుట్రల వల్ల తమ పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌధరీ ఆవేదన వ్యక్తం చేశారు. హింసతో ఏమీ సాధించలేమనే విషయాన్ని తెలుసుకొని పాకిస్థాన్ ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని వదులుకోవాలని హితవు పలికారు. మూడు దశాబ్దాలుగా అక్కడ ఉన్న ఉగ్రవాదం అంతమై.. మంచి పరిస్థితులు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కానీ, జమ్ముకశ్మీర్ ప్రభుత్వం కానీ మన పిల్లల బలిదానాలను ఎప్పటికీ కోరుకోవు. సరిహద్దు అవతల పన్నుతున్న కుట్రల కారణంగానే వారు ప్రాణాలు కోల్పోతున్నారు.

గత 30ఏళ్లుగా మనపై దాడులు చేస్తున్నా వారు ఏమీ సాధించలేదని.. ఉగ్రచర్యలకు భారత్ లొంగదని పాకిస్థాన్ గుర్తు పెట్టుకోవాలి. ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల తనకు తానుగా ప్రమాదాన్ని తెచ్చిపెట్టుకుంటోంది" అని సురీందర్ చౌధరీ అన్నారు. కథువా జిల్లాలోని సఫియాన్ అడవిలో ఉగ్రవాదులతో రెండు రోజుల పాటు జరిగిన ఎన్కౌంటర్లో పాకిస్థాన్కు చెందిన ఉగ్రసంస్థ జైష్-ఎ-మొహమ్మద్ (జెఎం)తో సంబంధం ఉన్న ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా, ఒక డీఎస్పీతో పాటు నలుగురు సైనికులు గాయపడ్డారు. ఈ ఆపరేషన్ ఇప్పటికీ కొనసాగుతోంది. మృతిచెందిన పోలీసులకు నివాళులర్పించిన అనంతరం సురీందర్ మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. కథువా జిల్లాలోని అడవుల్లో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో నేషనల్ సెక్యూరిటీ గార్డ్, బీఎస్ఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ బృందాలు గత ఐదు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఇంకా ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు స్థానికంగా నక్కిఉన్నట్లు సమాచారం. ఆర్మీ దుస్తుల్లో ఉన్న ఉగ్రవాదులు తమను మంచి నీళ్లు అడిగారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వారికోసం వేట కొనసాగిస్తున్నాయి.

తెలుగువారు ఉన్నంత వరకు తెదేపా ఉంటుంది:చంద్రబాబు

ఒక మహనీయుడి విజన్ తెలుగు దేశం పార్టీ అని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు.

అమరావతి, మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): ఒక మహనీయుడి విజన్ తెలుగు దేశం పార్టీ అని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. ఆదర్శం కోసం పుట్టిన పార్టీ తమదని పేర్కొన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబు మాట్లాడారు. "పార్టీ పెట్టి 9 నెలల్లో అధికారం దక్కించుకున్న ఏకైక పార్టీ తెదేపా. పేదల సంక్షేమానికి నాంది పలికిన మహనుభావుడు ఎన్టీఆర్. పార్టీకి మనమంతా వారసులం మాత్రమే.. పెత్తందారులం కాదు. నేను కూడా పార్టీకి అధ్యక్షుణ్ని.. టీమ్ లీడర్ను మాత్రమే.

ప్రతి కార్యకర్తకు న్యాయం చేయాలి. తెలుగువారు ఉన్నంత వరకు పార్టీ ఉంటుంది. పార్టీని లేకుండా చేయాలని చాలా మంది ప్రయత్నించారు. అలాంటి వారు కాలగర్భంలో కలిసిపోయారు. తెదేపాను ఏమీ చేయలేకపోయారు. ముహూర్త బలం చాలా గొప్పది. పార్టీ సంకల్ప బలం కూడా చాల గొప్పది. చరిత్రలో తెదేపా నాటి స్వర్ణ యుగం అని చెప్పుకొనే రోజులు శాశ్వతంగా వస్తాయి. 43 ఏళ్ల ఎన్నో సంక్షోభాలు వచ్చాయి.. అవకాశంగా తీసుకుని విజయాలు సాధిస్తున్నాం. పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నా" అని చంద్రబాబు అన్నారు.

రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు:లోకేశ్

పార్టీలో సంస్కరణలపై తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో సంస్కరణలు తనతోనే మొదలు కావాలని ఆయన అన్నారు. మూడు సార్లు ఒకే పదవిలో ఉన్న వారు ఆ తర్వాతి స్థాయికి వెళ్లాలి లేదా బ్రేక్ తీసుకోవాలన్నారు. నాలుగు సార్లు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న తన నుంచే ఈ సంస్కరణ ప్రారంభించాలని ప్రతిపాదిస్తున్నానన్నారు. గ్రామస్థాయి నాయకులు రాష్ట్ర నేతలుగా ఎదిగి పొలిట్ బ్యూరోలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. యువతకు రెక్కలు వచ్చి రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. సీనియర్లు, జూనియర్లకు సమ ప్రాధాన్యం ఇసామన్న ఆయన.. పని చేసే వారికి మాత్రమే ప్రమోషన్లు ఉంటాయని వెల్లడించారు. పార్టీలో యువరక్తం నింపేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని కోరారు. తాను ఎక్కడ మాట్లాడుతున్నా రెడ్ బుక్ ప్రస్తావన వస్తోందన్న ఆయన.. రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు వస్తోంది, ఇంకొందరు బాత్రూమ్ ల్లో జారిపడతున్నారని విమర్శించారు. ఇగోలు, అధికార గర్వం పక్కన పెట్టి అంతా కలసికట్టుగా పనిచేద్దామని లోకేశ్ పిలుపునిచ్చారు.

తెదేపా ఆవిర్భావ దినోత్సవం..

ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, లోకేశ్ నివాళి

ఎన్టీఆర్ భవన్లో ఘనంగా తెదేపా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

మంగళగిరి, మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): ఎన్టీఆర్ భవన్లో ఘనంగా తెదేపా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వేడుకలకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, నారా లోకేశ్, పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాళి అర్పించారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అంతా కష్టపడాలన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో చంద్రబాబు, లోకేశ్ వెంట ఉండాలని చెప్పారు. తన ప్రాణం ఉన్నంతవరకు చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తానన్నారు.

హిమాచల్తో విద్యుత్ ఒప్పందం.. గొప్ప ముందడుగు: భట్టి విక్రమార్క

తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్ను దృష్టిలో పెట్టుకొని 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్లో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

హైదరాబాద్, మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్ను దృష్టిలో పెట్టుకొని 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్లో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ భద్రతను పెంచుకునే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్థికంగా మేలైనది, స్వచ్ఛమైన విద్యుత్ను పొందేందుకు ఈ ఒప్పందం గొప్ప ముందడుగన్నారు. ఇవాళ హిమాచల్ రాజధాని శిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖుతో సమావేశమైన భట్టి.. విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. "థర్మల్ పవర్ తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి (జల విద్యుత్) వ్యయం తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ఏటా పెరుగుతూ ఉండగా.. హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఎక్కువ జీవనదులు ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతర హైడల్ పవర్ (జల విద్యుత్) ఉత్పత్తికి అనువుగా ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, పర్యావరణ హితమైన విద్యుత్ను అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్కో నామినేషన్ విధానంలో చేపడుతుంది" అని భట్టి తెలిపారు.

దేశ వ్యతిరేక సంస్థల నుంచి కునాల్కు నిధులు:శివసేన

విదేశాల్లోని భారత వ్యతిరేక సంస్థల నుంచి స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా నిధులు పొందుతున్నారని శివసేన నేత రాహుల్ ఆరోపించారు.

ముంబయి, మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ శిందే పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాపై శివసేన నేత రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. విదేశాల్లోని భారత వ్యతిరేక సంస్థల నుంచి స్టాండప్ కమెడియన్ కునాల్ నిధులు పొందుతున్నారని ఆరోపించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర అధికార నాయకుల గురించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నందుకు విదేశాలలోని భారత వ్యతిరేక ఉగ్ర సంస్థలు, ఖలిస్తానీ గ్రూపులు కునాలు డబ్బులు ఇస్తున్నాయని అన్నారు. వీటి ద్వారా ఆయనకు వచ్చిన నగదుకు సంబంధించిన 300 స్క్రీన్షాట్లు ఉన్నాయని.. వాటిని పోలీసులకు అందజేస్తానని రాహుల్ పేర్కొన్నారు. నిజం తెలియాలంటే అధికారులు కునాల్ యూట్యూబ్ ఖాతాను డీమోనిటైజ్ చేసి, పరిశీలించాలని డిమాండ్ చేశారు. మన దేశం ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం కొన్ని దేశాలకు నచ్చలేదని.. అందుకే కునాల్ వంటి కొందరికి డబ్బు ఆశచూపి ప్రజల్లో మన నాయకులను తప్పుగా చూపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు. అతడికి సంబంధించిన ఆర్థి లావాదేవీలను నిలిపివేయాలని.. వాటిని నిఘా వేయాలని డిమాండ్ చేశారు. కాగా శిందేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కామెడీ షో రికార్డు చేసిన ప్రదేశం బుకింగ్ డబ్బు మాతోశ్రీ నుంచి, ఉద్ధవ్ ఠాక్రే నుంచి వచ్చిందని శివసేన నేత సంజయ్ నిరుపమ్ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ శిందే పై ఇటీవల కునాల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆయనపై పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. ఏప్రిల్ 7వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కునాల్ తన షోలో ప్రత్యేకంగా ఎవరినీ ప్రస్తావించలేదని అతడి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, ఈ కేసులు మహారాష్ట్రలో నమోదైనప్పటికీ తమిళనాడుకు చెందిన వ్యక్తి కావడంతో మద్రాసు హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. తాజాగా ముంబయిలో ఆయనపై మరో మూడు కేసులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

హీటెక్కిన ఆంధ్రప్రదేశ్..

150కి పైగా మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

వడగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తారెత్తాయి. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో సగటున 40 డిగ్రీలకు చేరాయి.



విజయవాడ, మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): వడగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తారెత్తాయి. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో సగటున 40 డిగ్రీలకు చేరాయి. సాధారణం కంటే 4 డిగ్రీల వరకూ ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు ఐఎండీ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 150కి పైగా మండలాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

- ప్రకాశం జిల్లా కొమరోలు, నంద్యాల, కమలాపురంలో అత్యధికంగా 42.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రత
- ఎస్ కోట, అనకాపల్లి, అన్నమయ్య జిల్లా రుద్రవరంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు
- కర్నూలు జిల్లా కొసిగి, శ్రీకాకుళం జిల్లా మిళియాపుట్టు, సత్యసాయి జిల్లా తాడిమర్రి, సబ్బవరం, వీరఘట్టంలో 41 డిగ్రీలు
- అనంతపురం జిల్లా గుంతకల్లు, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, తిరుపతి, నెల్లూరులో 40 డిగ్రీలు
- చిత్తూరు, కృష్ణా జిల్లా మచిలీపట్నం, పల్నాడు జిల్లా నరసరావుపేట, ఏలూరు తదితర ప్రాంతాల్లో 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు

తెదేపా కేంద్ర కార్యాలయానికి చేరిన తిరువూరు పంచాయితీ

తిరువూరు పంచాయితీ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి చేరింది.

అమరావతి, మార్చి 29, (రిపబ్లిక్ న్యూస్): తిరువూరు పంచాయితీ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి చేరింది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తిరువూరు తెదేపా కార్యకర్తలు భారీ సంఖ్యలో పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. డౌన్ డౌన్ కొలికపూడి.. తిరువూరుకు కొలికపూడి వద్దు.. అంటూ పార్టీ కార్యాలయంలో నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కార్యకర్తలను సముదాయించారు. ఈ సందర్భంగా తిరువూరు ముఖ్య నేతలతో పల్లా భేటీ అయ్యారు. "ప్రతి ఒక్కరికీ పార్టీయే సుప్రీమ్. అధిష్ఠానం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలు ఉల్లంఘించి.. గీత దాటితే ఎవరిపైనైనా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎంతటివారిపైనైనా చర్యలు తీసుకునేందుకు వెనకాడబోయేది లేదు" అని పల్లా హెచ్చరించారు. కార్యకర్తల అభిప్రాయాలను పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై తెదేపా అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. '48 గంటల్లో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రమేశ్రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే తాను పార్టీకి రాజీనామా చేస్తా' అని కొలికపూడి అల్టిమేటం జారీ చేయడాన్ని అధినాయకత్వం తీవ్రంగా పరిగణించింది. గత 10 నెలలుగా తిరువూరులో చోటుచేసుకున్న ఘటనలు,

క్షేత్రస్థాయి పరిస్థితులు, కొలికపూడి వ్యవహారశైలిపై నివేదిక ఇవ్వాల్సిందిగా మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎంపీ కేశినేని శివనాథ్, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజుల్ని అధిష్ఠానం ఆదేశించింది. తిరువూరులో జరుగుతున్న వ్యవహారాలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, కొలికపూడిపై వస్తున్న ఆరోపణలు, తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్న ఆయన తీరుపై పార్టీ ఇప్పటికే వివిధ మార్గాల ద్వారా నివేదిక తీసుకున్నట్లు సమాచారం. ఈ ముగ్గురు సభ్యుల కమిటీ నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకోనున్నారు. గతంలోనూ పలు సందర్భాల్లో కొలికపూడి తీరు వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే రెండుసార్లు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రమశిక్షణ సంఘం ముందు ఆయన హాజరై వివరణలు ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని, అన్ని వర్గాల్నీ సమన్వయం చేసుకుంటానని తెలియజేశారు. కానీ, ఆయన తీరులో మార్పు రాకపోవడంపై పార్టీ పెద్దలు పెదవి విరుస్తున్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1790:** అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ టేలర్ జననం.
- **1857:** మొదటి భారత స్వాతంత్ర్య పోరాటం-సిపాయిల తిరుగుబాటు.
- **1952:** ప్రముఖ రచయిత కె.ఎన్.వై.పతంజలి జననం.
- **1953:** హైదరాబాదు రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు జమలాపురం కేశవరావు మరణం.
- **1982:** తెలుగు సినిమా నటుడు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారు.
- **1997:** భారతదేశ ప్రముఖ కళాకారిణి, రచయిత్రి పుపుల్ జయకర్ మరణం. (చిత్రంలో)


జాన్ టేలర్

మొదటి భారత స్వాతంత్ర్య పోరాటం

కె.ఎన్.వై.పతంజలి

జమలాపురం కేశవరావు


నందమూరి తారక రామారావు

పుపుల్ జయకర్

ఎల్2:ఎంపురాన్ వివాదం.. స్పందించిన రచయిత

మోహన్లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. ఈ సినిమా వివాదంపై చిత్ర రచయిత మురళీ గోపీ స్పందించారు.

మోహన్లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. ఈ సినిమాలోని పలు సన్నివేశాల విషయంలో వివాదం నెలకొంది. దీనిపై తాజాగా చిత్ర రచయిత మురళీ గోపీ స్పందించారు. ఈ వివాదంపై తానేమీ మాట్లాడాలనుకోవడం లేదన్నారు. "ఈ కాంట్రవర్సీ గురించి నేను పూర్తిగా మౌనంగా ఉండాలనుకుంటున్నా. వాళ్లకు నచ్చినవిధంగా అనుకోనివ్వండి. ఒక సినిమాని తమకు నచ్చినవిధంగా ఊహించుకునే హక్కు ప్రతిఒక్కరికీ ఉంది. కాబట్టి.. వాళ్లకు నచ్చినవిధంగా ఊహించుకోనివ్వండి. నేను మాత్రం మౌనంగానే ఉంటాను" అని అన్నారు. అదేవిధంగా ఆయన వామపక్ష భావజాలం ఉన్న సంస్థలపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు చాలాకాలం క్రితమే తమ భావజాలాలను విడిచిపెట్టారన్నారు. 2019లో విడుదలైన 'లూసిఫర్' లో భాగంగా 'ఎల్ 2: ఎంపురాన్' సిద్ధమైంది. స్టీఫెన్ గట్టుపల్లిగా మోహన్లాల్, జతిన్ రామ్మోన్గా టొవినో థామస్, బాబా భజరంగీగా అభిమన్యు సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని రూపొందించిన పృథ్వీరాజ్ ఇందులో సయ్యద్ మసూద్ నటించారు. ఎన్నో అంచనాల మధ్య గురువారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, ఇందులోని పలు సన్నివేశాల విషయంలో అంతటా తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. 2002లో గుజరాత్లో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో ఇందులో కీలక సన్నివేశాలుగా చూపించారు. అల్లర్ల సమయంలో సయ్యద్ మసూద్ కుటుంబాన్ని ఒక వర్గానికి చెందిన నాయకుడు దారుణంగా హత్య చేయడం.. కొంతకాలానికి అతడే రాజకీయాల్లోకి అడుగుపెట్టడం వంటి అంశాలతో సాగిన ఈ సన్నివేశాలను పలువురు తప్పుపడుతున్నారు. ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపించేలా ఈ సీన్స్ ఉన్నాయని అంటున్నారు. పృథ్వీరాజ్ దర్శకత్వాన్ని విమర్శిస్తూ నెట్టింట వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని నిలిపివేయాలని వామపక్ష వాదులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజులు ఏ రూ.100 కోట్లు

కలెక్షన్స్ పరంగా 'ఎల్2: ఎంపురాన్' దూసుకెళ్తోంది. 48 గంటల్లోనే రూ.100 కోట్లు వసూలుచేసి చరిత్ర సృష్టించిందని టీమ్ పేర్కొంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోహన్లాల్ తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.

తమన్నాతో బ్రేకప్.. రిలేషన్షిప్ పై విజయ్ వర్మ వ్యాఖ్యలు

నటి తమన్నా, నటుడు విజయ్ వర్మ విడిపోయారంటూ గత కొంతకాలంగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిలేషన్షిప్ పై తన అభిప్రాయాన్ని తెలియజేశారు విజయ్ వర్మ.



'లస్ట్ స్టోరీస్ 2'తో పరిచయమై.. కొంతకాలానికే ప్రేమలో పడ్డారు తమన్నా, విజయ్ వర్మ . సుమారు రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న వీరిద్దరూ ఇటీవల బ్రేకప్ చెప్పేసుకున్నారని గత కొన్ని రోజులుగా కథనాలు వెలువడుతున్నాయి. ఆన్లైన్లో ఈ వార్తలు వైరల్గా మారిన తరుణంలో తాజాగా నటుడు విజయ్ వర్మ రిలేషన్షిప్పు ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రిలేషన్షిప్ లోని ప్రతి విషయాన్ని ఆనందించాలని ఆయన అన్నారు. ఒక బంధాన్ని సంతోషంగా మార్చుకొనే సమయంలో ఎలాంటి పరిణామాలు ఎదురైనా వాటిని స్వీకరించాలన్నారు. "రిలేషన్షిప్పు ఒక ఐస్క్రీమ్ మాదిరిగా ఆద్యంతం ఆస్వాదించాలి. అలా చేసినప్పుడే నువ్వు సంతోషంగా ఉండగలవు. సంతోషం, బాధ, కోపం, చిరాకు.. ఇలా ప్రతి అంశాన్ని నువ్వు స్వీకరించాలి. దానితోపాటు ముందుకుసాగాలి" అని ఆయన అన్నారు. మరోవైపు, తమన్నా సైతం ఇటీవల ప్రేమ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. నిస్వార్థమైన ప్రేమను తాను నమ్ముతానని అన్నారు. ప్రేమను ఎప్పుడైతే వ్యాపార లావాదేవీగా మూడటం మొదలు పెడతామో అప్పుడే అసలు సమస్యలొస్తాయని ఆమె చెప్పుకొచ్చారు. రిలేషన్లో ఉన్నప్పుడు కంటే లేనప్పుడే తాను ఆనందంగా ఉన్నానని.. భాగస్వామి ఎంపిక విషయంలో ఒకింత జాగ్రత్తగా ఉండాలంటూ ఒకరకమైన హెచ్చరిక చేశారు. 2023లో విడుదలైన 'లస్ట్ స్టోరీస్ 2' కోసం తొలిసారి కలిసి వర్క్ చేశారు తమన్నా, విజయ్ వర్మ. ఈ సిరీస్ చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ఈ జంట బయట పెట్టింది. రిలేషన్లో ఉన్నప్పుడు ప్రతి ఫంక్షన్కు కలిసి హాజరైన ఈ జంట.. ఇటీవల జంటగా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో వీరిద్దరూ విడిపోయారని ప్రచారం సాగుతోంది. ఆ వార్తలపై వీరిద్దరూ స్పందించలేదు కానీ, రవీనాటాండన్ ఇంట జరిగిన హోళీ వేడుకలకూ వేర్వేరుగానే వచ్చారు. అంతేకాకుండా ఆమె షేర్ చేసిన ఫొటోల్లో ఆయన కనిపించలేదు. ఆయన పంచుకున్న ఫొటోల్లో తమన్నా జాడే లేదు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'ది ఫ్యామిలీ మ్యాన్ 3'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

మనోజ్ బాజ్పాయ్ కీలకపాత్రలో నటించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్ 3.

ఇందులో రెండేళ్ల కిత్రమే జైదీప్ అహ్లావత్ భాగమైనట్లు ఆయన తెలిపారు.

ప్రేక్షకులను విశేషంగా అలరించిన భారతీయ వెబ్సిరీసుల్లో 'ది ఫ్యామిలీ మ్యాన్' కూడా ఒకటి. ప్రస్తుతం దీని మూడో సీజన్ కోసం సినీప్రియులంతా ఎదురు చూస్తున్నారు. మనోజ్ బాజ్పాయ్ కీలకపాత్ర పోషించగా.. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో ఇది రూపొందింది. తాజాగా దీనిపై మనోజ్ బాజ్పాయ్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. "పాతాళ్లోక్-2'లో తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న జైదీప్ అహ్లావత్ 'ది ఫ్యామిలీ మ్యాన్ 3'లో కనిపించనున్నారు. రెండేళ్ల క్రితమే ఆయన ఈ ప్రాజెక్ట్లో భాగమయ్యారు. ఆయన ఉన్నట్లు తెలిసినప్పటికీ రెండేళ్లక్రితమే ఇందులో జాయిన్ అయినట్లు ఎవరికీ తెలియదు. ఆయన పాత్ర పవర్ఫుల్ ఉంటుంది. ఆ పాత్ర వివరాలు మాత్రం ఇప్పుడే వెల్లడించలేం. ఇక నవంబర్ నుంచి ఇది అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్కు అందుబాటులోకి వస్తుంది" అని తెలిపారు. ఈ స్పై థ్రిల్లర్ సిరీస్లో మరో అగ్ర నటుడు భాగం కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఓటీటీలో అత్యంత ఎక్కువ వ్యూస్ను సొంతం చేసుకుంది 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటివరకూ రెండు సీజన్లు పూర్తి చేసుకున్న యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి సిద్ధమైంది. పార్ట్ 3లో జైదీప్ అహ్లావత్ ప్రతినాయకుడిగా నటిస్తున్నట్లు సమాచారం. 'సీజన్2'లో సమంత ప్రతినాయకురాలిగా నటించారు. తమిళ టైగర్స్ తరపున పోరాటం చేసే మహిళగా కనిపించారు.

బాలీవుడ్ విషయంలో ఆందోళనగా ఉంది:జాన్ అబ్రహం

బాలీవుడ్లో మార్పు రావాలని జాన్ అబ్రహం అన్నారు. భిన్నమైన కథలను తెరకెక్కించాలని సూచించారు.

హిందీ చిత్ర పరిశ్రమను చూస్తుంటే ఆందోళనగా ఉందని బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన ప్రస్తుతం బాలీవుడ్లో తెరకెక్కుతున్న సినిమాల గురించి మాట్లాడారు. బాలీవుడ్లో తెరకెక్కే సినిమాలపై సోషల్ మీడియాలో తీవ్రంగా విమర్శలు వస్తున్నాయని తెలిపారు. "హిందీ చిత్రపరిశ్రమ గందరగోళంగా ఉంది. ఈ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తిగా నేను ఆందోళన చెందుతున్నాను. భిన్నంగా ప్రయత్నించాల్సిన సమయం వచ్చింది. కొత్తగా ప్రయత్నించాలనుకునే వారు చాలా తక్కువమంది ఉన్నారు. నేను కమర్షియల్ హీరోని.. ఎప్పుడూ కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకూడదు. భిన్నమైన కథలను తెరకెక్కించాలి. అలా జరగాలంటే నటీనటులకు, దర్శక నిర్మాతలకు స్వేచ్ఛ ఉండాలి. అలాంటప్పుడే పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. మనం మంచి సినిమాలు తెరకెక్కిస్తున్నప్పటికీ ప్రతిరోజూ ఎవరో ఒకరు మన ఇండస్ట్రీని విమర్శిస్తుండటంతో బాధ కలుగుతుంది" అని జాన్ అబ్రహం అన్నారు. బాలీవుడ్ ప్రముఖులు వరుసగా టాలీవుడ్ను పిష్ట్ అవుతోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ బాలీవుడ్ను వీడుతున్నట్లు ఇటీవల ప్రకటించారు. తాజాగా నటుడు సన్నీదేవోల్ కూడా తనకు దక్షిణాదిలో స్థిరపడాలని ఉందని వెల్లడించారు. దక్షిణాదిలో నటీనటులను ఎంతో గౌరవిస్తారని ఆయన అన్నారు. సినిమాను ఎలా నిర్మించాలో వాళ్లకు తెలుసన్నారు. వారిని చూసి బాలీవుడ్ నేర్చుకోవాలని చెప్పారు. ఇక జాన్ అబ్రహం సినిమాల విషయాకొస్తే.. ఇటీవల 'ది డిప్లొమాట్'తో ప్రేక్షకులను పలకరించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా శివమ్ నాయర్ దర్శకత్వంలో ఇది రూపొందింది. ఇప్పటివరకూ ఈ సినిమా రూ.30 కోట్లు వసూలుచేసింది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

లోయర్ ఆర్డర్లో బ్యాటింగ్..
గతంలోనే కారణమేంటో చెప్పిన ధోని

ఐపీఎల్లో ధోనీ బ్యాటింగ్ ఆర్డర్పై ఇప్పుడు అంతా చర్చ సాగుతోంది. అతడు ఎందుకు ఇలా లోయర్ ఆర్డర్ దిగువన వస్తున్నాడనేది అర్థంకావడం లేదు. కానీ, ఈ సీజనక్కు ముందే ఓ ఛానల్ లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ధోనీనే స్పష్టత ఇచ్చాడు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్లో చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 9వ స్థానంలో బ్యాటింగ్కు దిగాడు. దూకుడుగా ఆడిన అతడు 16 బంతుల్లోనే 30 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే, సీఎస్కేకు మాత్రం ఓటమి తప్పలేదు. దీంతో ధోనీ మరీ లోయర్ ఆర్డర్ దిగువన రావడంపై సోషల్ మీడియాతోపాటు మాజీ క్రికెటర్ల నుంచి కామెంట్లు వచ్చాయి. మ్యాచ్లో ముందొస్తే గెలిచే అవకాశాలు ఉండేవని అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, ధోనీ ఇలా దిగువస్థాయిలో బ్యాటింగ్కు రావడానికి కారణమేంటో గతంలోనే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఇప్పుడా వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఒకటి లేదా రెండు మ్యాచుల్లో ఓడినా సరే కుర్రాళ్లకు ఎక్కువ అవకాశం ఇవ్వడం ముఖ్యమనేది ధోనీ ఆలోచన అని తెలుస్తోంది. గత టీ20 ప్రపంచకప్ ముందు ఐపీఎల్ 2024 సీజన్లో జరిగిన సంగతి తెలిసిందే. అప్పుడు కూడా ధోనీ 8వ స్థానంలో బ్యాటింగ్కు వచ్చాడు. "నాకు అప్పుడు మోకాలి సమస్య ఉంది. గతేడాది నేను దానినుంచి బయటపడ్డా. ఐపీఎల్ 2024 సీజన్ తర్వాత టీ20 ప్రపంచకప్ జరిగింది. ఈ మెగా లీగ్ లో రాణిస్తే ప్రపంచకప్ జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువ. సీఎస్కే నుంచి రవీంద్ర జడేజా, శివమ్ దూబె పోటీలో ఉన్నారు. వారికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. నేనేమీ జాతీయ జట్టు సెలక్షన్ రేసులో లేను. అందుకోసం పోటీపడటం లేదు. రవీంద్ర జడేజా, శివమ్ దూబె అద్భుతంగా ఆడారు. పొట్టి కప్ కోసం ప్రకటించిన జట్టుకు ఎంపికయ్యారు. మా ఫ్రాంచైజీ ప్లేయర్ల అవకాశాలను నాశనం చేసేది కాదు. ఆటగాళ్లను ప్రమోట్ చేసేందుకు చూస్తాం. ఎవరికివారు తమ పాత్రను పోషిస్తూ నాపై ఒత్తిడి తగ్గిస్తుంటే అంతకుమించి ఇంకేం కావాలి" అని ధోనీ వ్యాఖ్యానించాడు.

ఇలాంటప్పుడు వచ్చుంటే..

"విరిగిపోని దానిని మళ్లీ అతికించడం ఎందుకు? బ్యాటర్లు మంచిగా పరుగులు చేస్తున్నప్పుడు సమస్య ఏముంటుంది. ఒకటీ, రెండు మ్యాచుల్లో ఫలితం అనుకూలంగా రాకపోయినా.. కంగారుపడాల్సిన అవసరం లేదు. ప్రతిసారీ ఇలాగే జరిగితే మాత్రం నా ఆలోచనల్లో మార్పు రావచ్చు. అంతా బాగున్నప్పుడు అలాగే కొనసాగించాలి" అని ధోనీ వ్యాఖ్యానించాడు. ఇప్పుడు బెంగళూరుతో మ్యాచ్లో కష్టాల్లో ఉన్నప్పుడు ధోనీ కాస్త ముందుగా బ్యాటింగ్కు వచ్చుంటే బాగుండేదని క్రికెట్ విశ్లేషకులు సూచించారు. తొలి మ్యాచ్లోనూ (ముంబయితో) ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్కు దిగాడు. ఈ సీజన్ తర్వాత రిటైర్మెంట్ తీసుకుంటాడనే వ్యాఖ్యలు వినిపిస్తున్న వేళ.. సీఎస్కేను మానసికంగా సిద్ధం చేసేందుకు ధోనీ ఇలాంటి ప్రణాళికలు రూపొందించినట్లు క్రీడా పండితులు చెబుతున్న మాట.

అందం

నిమ్మకాయతో మచ్చల్లేని అందమైన ముఖం

మీ సొంతం, ఎలా వాడాలో తెలుసా?

చాలా మంది డార్క్స్పాట్స్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తగ్గించడానికి కొన్ని ఇంటి చిట్కాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. అందులో నిమ్మకాయ ఒకటి. అవును నిమ్మకాయతో ముఖంపై ఉన్న మచ్చలను తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

ప్రతి ఒక్కరు అందంగా ఉండాలని కోరుకుంటారు. ప్రతి ఒక్కరూ మెరిసే చర్మం, గ్లాసీ స్కిన్ కావాలని కోరుకుంటారు. అమ్మాయిలైతే మచ్చలేని, మెరిసే చర్మం కోసం తాపత్రయ పడుతుంటారు. అయితే, పొల్యూషన్, ఆహారపు అలవాట్లు, అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా అనేక చర్మ సంబంధింత సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖంపై మచ్చలు, ముడతలు, డార్క్ సర్కిల్స్, మొటిమలు, పాడిబారడం వంటి ఎన్నో సమస్యలు వస్తున్నాయి. ఇక, అందమైన ముఖం కోసం చాలా ఖర్చు చేస్తుంటాం. మార్కెట్లో దొరికే ఖరీదైన ప్రాడక్ట్స్ వాడుతుంటాం. అయినా, ఫలితం ఉండకపోవచ్చు. దీంతో చాలా మంది ఇంత ఖర్చు చేసినా ఫలితం లేదని బాధపడుతుంటారు. అయితే, చాలా మంది డార్క్స్పాట్స్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తగ్గించడానికి కొన్ని ఇంటి చిట్కాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. అందులో నిమ్మకాయ ఒకటి. అవును నిమ్మకాయతో ముఖంపై ఉన్న మచ్చలను తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. మచ్చల్లేని ముఖం కోసం నిమ్మకాయను ఎలా ఉపయోగించాలో ఇక్కడ తెలుసుకుందాం.



నిమ్మకాయతో ప్రయోజనాలు

నిమ్మకాయలో విటమిన్ సి, సిట్రిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి చర్మపు మచ్చలను తగ్గించడంలో సాయపడతాయి. అంతేకాకుండా చర్మపు ఛాయను మెరుపర్చడంలో నిమ్మకాయ ప్రభావవంతంగా పనిచేస్తుంది. నిమ్మకాయలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇవి ముఖంపై నుంచి మొటిమలు, పిగ్మెంటేషన్ను తొలగించడంలో సాయపడతాయి. నిమ్మకాయను క్రమం తప్పకుండా వాడటం వల్ల అందమైన, మెరిసే చర్మాన్ని పొందవచ్చని నిపుణులు అంటున్నారు. అయితే, ఎలా వాడాలో తెలుసా?

నిమ్మకాయ, తేనె

ముఖంపై ఉన్న మచ్చలను తొలగించడానికి నిమ్మకాయ, తేనెను ఉపయోగించవచ్చు. తేనె చర్మానికి కావాల్సిన తేమను అందిస్తుంది. ఈ కాంబినేషన్ మచ్చలు, పిగ్మెంటేషన్ తొలగించడంలో సాయపడుతుంది. ఇందుకోసం గిన్నెలో ఒక చెంచా తేనె తీసుకోండి. దానికి ఒక చెంచా నిమ్మరసం వేసి బాగా కలపండి. రెండు బాగా కలవాలని అర్థం చేసుకోండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖం మీద అప్లై చేసి కొంత సేపు అలాగే ఉంచండి. దాదాపు 20 నిమిషాల తర్వాత ముఖాన్ని నీటిలో వాష్ చేసుకోండి. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఈ రెమిడీ వాడటం వల్ల మచ్చలు తొలగిపోవడమే కాకుండా చర్మ ఛాయ కూడా మెరుగుపడుతుంది.

నిమ్మకాయ, పెరుగు

ముఖం మీద మచ్చలతో ఇబ్బంది పడేవారికి ఇది బెస్ట్ ఆప్షన్. పెరుగులో నిమ్మకాయ కలిపి అప్లై చేస్తే ముఖం మీద మచ్చలు తొలగిపోతాయి. పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది మచ్చలను తగ్గించడంలో సాయపడుతుంది. ఇందుకోసం ఒక గిన్నెలో రెండు చెంచాల పెరుగు తీసుకోండి. దానికి ఒక చెంచా నిమ్మరసం వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి తేలికగా, మృదువుగా మసాజ్ చేయండి. పది నుంచి పదిహేను నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఆ తర్వాత ముఖాన్ని నీటితో వాష్ చేసుకోండి. దీని వల్ల మచ్చలు, ముడతల సమస్య తొలగిపోతుంది. అంతేకాకుండా ముఖంలో గ్లో కూడా వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

నిమ్మకాయ, టమాటా

ముఖంలోని మచ్చలను తొలగించడానికి, టమాటాతో నిమ్మకాయను కలిపి అప్లై చేయవచ్చు. ఇందుకోసం, ఒక గిన్నెలో రెండు చెంచాల టమోటా గుజ్జు తీసుకోండి. అందులో ఒక చెంచా నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవాలి. దాదాపు 10-15 నిమిషాల తర్వాత, ముఖాన్ని నీటితో కడుక్కోండి. ఈ కాంబినేషన్ ముఖం మీద ఉన్న మొటిమలు, మచ్చలను పదిలించుకోవడానికి సాయపడుతుంది. అంతేకాకుండా ముఖం కాంతి కూడా పెరుగుతుంది. ఈ రెమిడీను వారానికి రెండు సార్లు అప్లై చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

నిమ్మరసం, పసుపు

ముఖం మీద మచ్చలు ఉంటే.. పసుపు, నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవచ్చు. నిమ్మకాయలో సిట్రిక్ యాసిడ్, విటమిన్ సి ఉంటాయి. ఇవి మచ్చలను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటాయి. ఇందుకోసం ఒక చెంచా నిమ్మరసం తీసుకుని అందులో చిటికెడు పసుపు కలపండి. ఇప్పుడు దానిని కాటన్ బాల్ సహాయంతో ముఖంపై అప్లై చేయండి. 10 నిమిషాల తర్వాత, ముఖాన్ని నీటితో బాగా కడగాలి. అయితే, మీకు సున్నితమైన చర్మం ఉంటే మాత్రం దీనిని వాడకపోవడమే మంచిది.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.